

కొర్రాయి వంతెన వద్ద మరమ్మతు పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొర్రాయి వంతెనపైన గెడ్డ నీరు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొములు సందర్శించి పరిశీలించారు. వెంటనే స్థానికుల సహాయంతో వంతెన వద్ద గొట్టాలను అమర్చి వాహన రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, గత మూడు ఏళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు మతధ్యలో నిలిచి పోయాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తిగా నిర్మించాలని ఆయన కోరారు.


జెసిబితో చేపడుతున్న పనులు

మన్యంలో ఏకధాటిగా వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం


రాజవొమ్మంగి మండలం నెల్లిమెట్ల వాగు కల్వర్టు పైనుండి ప్రవహిస్తున్న వరదనీరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా మన్యంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాజవొమ్మంగి మండలంలోని మడేరు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, లబ్బర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం కురిసిన వర్షానికి గింజర్తి గ్రామ సమీపంలోని ఒట్టిగడ్డ వాగు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు అడుగులు ఎత్తులోనూ, నెల్లిమెట్ల వద్ద వాగు పైనుండి వరద నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గంటల తరబడి రాకపోకలు ఆగిపోయాయి. వాహనదారులు, రైతులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే ఇదే పరిస్థితి నెలకొంటున్న నేపథ్యంలో వాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వర్షాలు పుష్కలంగా కురుస్తున్న తరుణంలో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తున్నారు. భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సీఐ ఎస్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో వాగులు వద్ద శుక్రవారం పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలెవరూ వాగులు వెంబడి, కల్వర్టులు, బ్రిడ్జిలు పైనుండి కాలినడకన వెళ్ళటం, వాహనాలపై ప్రయాణించడం చేయొద్దని హితవుపలికారు. మండల పరిధిలో ఎక్కడైనా రహదారులపై అడ్డంగా చెట్లు పడిన, వాగులు తెగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, పోలీస్ సిబ్బంది చందు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలో గత మూడు రోజుల నుంచి ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పెదగెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో రవాణా సౌకర్యానికి మారుమూల ప్రాంత గ్రామాలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని గత్తర జిల్లేడ సమీపంలోని కొర్రాయి వంతెన పైకి గెడ్డ నీరు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నూతనంగా నిర్మిస్తున్న వంతెన కూడా అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు వంతెన దాటలేక నిలిచిపోయారు. వంతెన నిర్మాణం కోసం మట్టి తీసి వదిలేయడంతో వాహనాలు మట్టిలో దిగబడుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు, అటవీ ఉత్పత్తులు సాగుచేసిన గిరిజనులు శుక్రవారం జరిగిన అరకు వారపు సంతకు తరలించిందుకు కొర్రాయి, కొల్లాపూట్టు ప్రాంత గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరకు వారపు సంతలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పోయింది. చాపరాయి జలపాతం గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుంది. వ్యవసాయ పంటలు సాగు చేసే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముంచంగిపుట్టు : మండలంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలుచోట్ల వాగులు, వంకలు, గెడ్డలు ఉపొంగి ప్రవహిస్తున్నాయి.. మండలంలో లక్ష్మీపురం, బరడా, వనుగుమ్మ, బూసిపుట్టు, బుంగపుట్టు, కుమడ బాబుశాల తదితర పంచాయితీలకు రాకపోకలు నిలిచి పోయాయి. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కర్లపొదోర్ గ్రామ సమీపాన ఉన్న గెడ్డలో చిక్కుకున్న మూగజీవాలను గిరిజనులు ప్రాణాలు పణంగా పెట్టి రక్షించారు. కర్ల పొదోర్ గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టాలని లక్ష్మీపురం సర్పంచ్ త్రినాధ్ ఆధ్వర్యంలో స్పందనలో వినతి పత్రాలు సమర్పించినా కనీసం స్పందన లేదు.


ముంచంగిపుట్టు మండలం కర్లపొదర్ గెడ్డలో మూగజీవాలను రక్షిస్తున్న గిరిజనులు

సీలేరు : ఇటీవల కురిసిన వర్షాలకు జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ బత్తునూరు వాగు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించడానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వాగుపై వంతెన నిర్మించాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని శుక్రవారం స్థానికులు జర్త రామారావు, పొత్తూరు అప్పారావు స్థానిక విలేకర్లకు తెలిపారు. పాత్రుని గుంట, లేతమర్రి, బుగ్గిరాయి, మైనకోట తదితర గ్రామాలు ప్రజలు వైద్య సేవలు, నిత్యావసర సరుకులు ఇలా ఏ అవసరమొచ్చినా ఈ వాగు దాటి రావాల్సిందే. వర్షా కాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, కనీసం తాత్కాలిక వంతెన అయినా నిర్మించాలని వారు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి వాగులో పడి వ్యక్తి గల్లంతు

రంపచోడవరం : మండలం పాత సీతపల్లి గ్రామ సమీపంలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని బి.వెలమలకోట గ్రామానికి చెందిన కొందరు సీతపల్లి గ్రామ సమీపంలోని వాగు వద్ద చేపలు పట్టేందుకు వచ్చారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సారపు వెంకన్న దొర (45) వాగులో పడి గల్లంతయ్యాడు. ఆయన కోసం గ్రామస్తులు వాగు వద్ద గాలింపు చర్యలు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మునిగిన గండిపోచమ్మ ఆలయం

దేవీపట్నం : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్ర రూపం దాల్చి మండలంలోని పూడిపల్లి పంచాయతీ గొందూరు గ్రామంలో గల గండి పోచమ్మ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. అమ్మవారి వడి కట్టును తాకి, అంతరాలయంలోకి చేరింది. అమ్మవారి హుండీలు, విగ్రహం మునిగాయి. వరదల నేపథ్యంలో పోచమ్మ గండిలోని నివసిస్తున్న 40 కుటుంబాలు పురుషోత్తం గ్రామానికి వెళ్లారు. ఎగువ ప్రాంతం నుండి భారీగా వరద ప్రవాహం పెరుగుతుందడంతో అధికారులు ఆలయంలో అమ్మవారి దర్శనాలు, పాపికొండల పర్యాటక బోట్లను నిలిపివేశారు. పర్యాటకులు, భక్తులెవరూ నది ప్రాంగణం వైపుగా వెళ్లొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పోచమ్మ గండి వైపు, రంపచోడవరం, గోకవరం వైపు రహదారులన్నీ జలమయమయ్యాయి. జాలర్లను వేటకు వెళ్లవద్దని, భక్తులు, యువత సెల్ఫీలు దిగడానికి అటుగా రావద్దని పోలీసులు తెలియజేశారు.


గండిపోచమ్మ ఆలయాన్ని ముంచేసిన గోదావరి వరద నీరు

జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా మన్యంలో ముసురు వాతావరణం అలుముకుంది. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు శుక్ర శనివారాలు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులు భారీ వర్ష సూచనలు వాతావరణ శాఖ హెచ్చరిక చేసిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు, వరద పరిస్థితులు తలెత్తితే అత్యవసర పరిస్థితుల్లో సహాయ కార్యక్రమాల అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08935 293120, 08935293448. విద్యుత్ సరఫరా నిలిచిన పరిస్థితులపై సత్వర పునరుద్ధరణ కోసం ఏపీ ఈపీడీసీఎల్ కూడా పాడేరు డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు 9490610026 నెంబర్‌కు విద్యుత్ సరఫరా అంతరాయం పై సమాచారం ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎన్ఎం అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు

జిల్లాలో నమోదైన వర్షపాతం

అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లో శుక్రవారం 954 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కాగా ఈ మేరకు జిల్లాలో సాధారణం 43.4 ఎంఎం నమోదయింది.. రంపచోడవరం మండలంలో 89.8 మిల్లీమీటర్లు దేవీపట్నంలో 88.4 కూనవరంలో 86.4 చింతూరులో 85.6 మారేడుమిల్లిలో 72.6 వర రామచంద్రపురం 68.2, జిమాడుగుల 66.4, ఎటపాక 62.2 ముంచంగిపుట్టు 45.4, అరకు వ్యాలీ 30.2, అనంతగిరి 28.6, హుకుంపేట 26.8, వై రామవరం 25.6, అడ్డతీగల 24.2, పాడేరు 20.8, గంగవరం 19.8, పెదబయలు 18.8, రాజవొమ్మంగి 16.4, చింతపల్లి జీకే వీధి మండలాల్లో 8.2, కొయ్యూరు మండలంలో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.



మాట్లాడుతున్న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం

- జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్

ప్రజాశక్తి -పాడేరు: గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జె.హుస్సేన్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ఈ పర్యటనలో సుమారు 40 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలకు సేవలు అందించడానికే జీతాలు ఇస్తున్నారన్న విషయం గుర్తుంచుకొని వారికి సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. కింది స్థాయిలో తప్పులు జరిగితే కమిషన్ ముందు హాజరు కావలసి ఉంటుందని, అటువంటి పరిస్థితి తెచ్చుకోవద్దని సున్నితంగా మందలించారు. ప్రతి పనికీ లంచాలు తీసుకోవటం తగదని, గిరిజనుడికి ఇల్లు కట్టుకునే అవకాశం కూడా ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. ఎస్టీ కమిషన్ కు విశేష అధికారాలు ఉన్నాయని గుర్తు చేసారు. ఆదివాసులకు అవగాహన లేదని, వారిని విస్మరించారాదని సూచించారు. ఈ సందర్భంగా సాయిల్ టెస్ట్, ఫసల్ భీమ, ఏకోపాధ్యాయ పాఠశాలల, భవనాలు లేని పాఠశాలలపై ఆరా తీసారు. గిరిజనులకు అవగాహన కల్పించి వారిని చదివించాలని, అప్పుడే వారి జీవితాలు మెరుగవుతాయని తెలిపారు.

ముందుగా జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల అలవాట్లు, పంటలు, విద్య, వైద్య సేవలు, పరివర్తన కింద గంజాయికి ప్రత్యామ్నాయ పంటలు, కాఫీ విస్తీర్ణం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఘన స్వాగతం

ముందుగాజాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, సబ్ కలెక్టర్ దాత్రి రెడ్డి, ఏపీవోలు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం పిఎంఆర్సి వద్ద ఆయన వివిధ ప్రజా సంఘాల నేతల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అరకు ఎంపీ తనూజ రాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు గిరిజన సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన వివిధ గిరిజన సంఘాలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.పాడేరు ఆదివాసీ ఉద్యోగ భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసి, ప్రజా సంఘాలతో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు హుస్సేన్ సమావేశం అయ్యారు. గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి శేషాద్రి అధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమీషన్ సభ్యులు మాట్లాడుతూ, ఆదివాసీలకు అన్యాయం జరిగితే కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫిర్యాదు పై పది హేను రోజుల్లో సమాధానం ఇస్తామన్నారు. ఆదివాసీ లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివాసీ జెఎసి రాష్ట్ర చైర్మన్ బాబురావు నాయుడు తెలిపారు. స్పెషల్ డి.ఎస్సీ. ను ప్రకటించాలని కోరారు. కమిషన్ సభ్యునడిని గిరిజన ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో డాక్టర్ టి.బాబురావు నాయుడు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ రమణ, ముఖి శేషాద్రి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, బిజెపి నాయకులు పాంగి రాజారావు, ఉమామహేశ్వరరావు, సింహాచలం, రామారావు దొర, ఈశ్వరరావు, రామారావు, గిడ్డి వరలక్ష్మి పాల్గొన్నారు.


విఆర్.పురంలో నేలకూలిన చింత చెట్టును తొలగిస్తున్న దృశ్యం

నేలకూలిన భారీ వృక్షాలు

ప్రజాశక్తి-విఆర్.పురం : భారీ వర్షాలకు మండలంలోని విఆర్ పురం నుండి వడ్డుగూడెం వెళ్లే రహదారిలో లోకేశ్వరావు అనే వ్యక్తి ఇంటి వద్ద ఉన్న పురాతన భారీ చింత చెట్టు శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో నేలకూలింది. చెట్టు కరెంట్ వైర్లపై పడడంతో విద్యుత్ ఆగిపోయింది. వడ్డుగూడెం గ్రామం నుండి విఆర్ పురం గ్రామం వరకు రాకపోకలు నిలిపోయాయి. లోకేశ్వరరావు ఇంటి బయట ఉన్న రేకులు షెడ్డుపై పడడంతో ఆది పూర్తిగా ధ్వంసమైంది. మండల తహశీల్దారు, విఆర్ పురం సెక్రెటరీ స్వరూపరెడ్డి విద్యుత్తి అధికారులు స్పందించి ఆ చెట్టును తొలగించారు. షెడ్డు కూలిపోయిందని, తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధిత లోకేశ్వరరావు అధికారులను కోరుతున్నారు.

రంపచోడవరం : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రంపచోడవరం మండలం పందిరి మామిడి సమీపంలో నడివీధి వద్ద శుక్రవారం రోడ్డుకు అడ్డంగా భారీ చింత చెట్టు పడింది. మండల కేంద్రానికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులు ఎమ్మెల్యే శిరీష దేవికి ఫోన్ ద్వారా సమాచారం అందించగా వెంటనే ఆమె చెట్లను కోసే వ్యక్తిని, ఒక జెసిబిని ఏర్పాటు చేసి చెట్టుని తొలగించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నవరం బ్రిడ్జిని పరిశీలించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి అన్నవరం ఉమ్మడివరం మధ్యలో వాగుపై ఉన్న బ్రిడ్జిని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య, మండల తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ శుక్రవారం పరిశీలించారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి అడవిలో నుంచి కొట్టుకొచ్చిన చెట్లు, చెత్తాచెదారం అన్నవరం బ్రిడ్జి వద్ద అడ్డంగా ఉండిపోవడంతో వంతెన పై నుండి నీరు ప్రవహిస్తోంది. దీంతో స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని ఆధ్వర్యాన జెసిబితో వాటిని తొలగించే పనులు చేపట్టారు. ఈ సమయంలోనే ఐటిడిఎ పిఒ చైతన్య అక్కడకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వర్షాలు, వరదలు పెరగడంతో వాగులు దగ్గర పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేయాలని, నిత్యావసర సరుకులు, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అన్నవరం బ్రిడ్జి వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

సాగునీరే..తాగునీరు..!

-విన్నవించుకున్నా పట్టించుకోని అధికారులు- కలుషితమైన నీరే ఆధారమని గిరిజనుల ఆవేదన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటింటికి సురక్షితమైన తాగునీరు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడం తప్పు! ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు పరచ లేదు. దీంతో ఏళ్లు గడుస్తున్నా గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. తప్పని పరిస్థితుల్లో గ్రామాలకు అందుబాటులో ఉన్న పొలంలోని, ఊటగెడ్డలను ఆశ్రయించి కలుషితమైన నీటిని ఉపయోగిస్తూ పలు రకాల వ్యాధుల బారినపడి సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణాలు పోతున్న పరిస్థితి నెలకొంది.

మండలంలోని కొల్లాపూట్టు పంచాయతీ నందివలస గ్రామమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఆ గ్రామంలో సుమారు 35 కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంతో ఆ గ్రామస్తులు పొలాల్లో వ్యవసాయం సాగు చేసే నీటిని పైపు గొట్టాలను అమర్చి ఉపయోగించుకుంటున్నారు.

ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉండటంతో ఆ నీరు కూడా పూర్తిగా బురదమయంగా ఉంటుంది. కలుషితమైన నీళ్ళని తెలిసినా కూడా తప్పని పరిస్థితిలో ఆ నీటినే ఉపయోగించుకుంటున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సురక్షితమైన తాగునీరు అందించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వారు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి గ్రామంలో సురక్షితమైన తాగునీరు కల్పించి ఆదుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.


గెడ్డలో బురద నీటిని పట్టుకుంటున్న మహిళలు


డుంబ్రిగుడ మండలం నందివలసలో సాగునీటి గొట్టాల నుంచి తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

బురదనీరే గతి

అనంతగిరి: వర్షాలకు కలుషితమైన బురద నీటిని తాగాల్సిన పరిస్థితి మండంలలోని గిరిజనులకు నెలకొంది. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ పరిధి వీరభద్రపురం గ్రామంలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామంలో బోరు, బావి, పైపులైన్ వంటివి కానరాలేదు.దీంతో ఆ గ్రామానికి చెందిన గిరిజన ప్రజలు రైవాడ జలశయానికి ప్రవహించే గెడ్డ నీటిని ఆశ్రహించాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవి, వర్షాకాలంలో కూడా ఈ నీరును ఆ గ్రామానికి చెందిన గిరిజన ప్రజలు ఉపయోగిస్తారు. వర్షాలకు కలుషితమైన బురద నీటిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజన ప్రజలు కోరుతున్నారు.

పశువుల వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- చింతపల్లి: గిరిజనులు పశువుల వ్యాధులపై పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని లంబసింగి పశు వైద్యాధికారి సిహెచ్.చాలిని సూచించారు. పెద్ద బరడ గ్రామంలో ఓ పశువు క్రిమి సంహారక మందు పిచికారి చేసిన గడ్డిని ఆహారంగా తీసుకోవడంతో ఇటీవల మరణించింది. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెద్ద బరడ గ్రామపంచాయతీ కేంద్రంలో పశువుల్లో కలిగే వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ, పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యశాలకు సమాచారం ఇస్తే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.మందులు పిచికారి చేసిన పొలాల వైపు పశువులను మేతకు తీసుకెళ్లరాదని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

తారు రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి. చింతపల్లి: కనెక్టివిటీ రహదారులలో భాగంగా కుడుముసారి పంచాయతీలోని ఆయా గ్రామాలను కలుపుతూ ఏడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కుడుముసారి పంచాయతీ జనసేన పార్టీ కమిటీ అధ్యక్షుడు గెమ్మెల బంగారయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పంచాయతీలోని ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఆయన మాట్లాడుతూ, కుడుముసారి పంచాయతీలోని వంగబంధ సెంటర్ నుంచి వంచుల దుర్గం, మెరికెళ్ళు, బోడ్డపుట్టు, కిలుములు గ్రామాల మీదుగా వందనపల్లి సెంటర్ వరకు సుమారు 7 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.స్వాతంత్రం వచ్చి ఏళు గడిచిన తమ మన్యం ప్రాంతం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని, నేటికీ తమ ప్రాంతంలో సరైన రహదారి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికీ వృద్ధులను, గర్భవతులను డోలీ మోతలతో ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందానరు.

'గీతం'లో ఎంబిఏ అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న ఎంబిఏ కోర్సులో శుక్రవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులను అభినందించిన గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పణిశప్ప మాట్లాడుతూ, విద్యార్థులలో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎనలిటిక్స్, బ్లూమ్‌బర్గ్‌తోపాటు బిజినెస్ ఇంగ్లీష్‌పై భాషా ప్రయోగశాలలు నెలకొల్పామన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా సిలబస్‌లో మార్పులు చేస్తూ, కేస్ స్టడీస్ ఆధారిత విద్యను ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎంబిఏ విద్యార్థులకు ప్రస్తుత పోటీ వాతావరణంలో ఎదిగేలా నైపుణ్యశిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతిభ గలవారికి పలురకాల స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామన్నారు.కార్యక్రమంలో పీజీ.కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎ.వేంకటేశ్వర్లు, యుజి. కోర్సుల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. షీలా, అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డాక్టర్ టి.వేంకటేశ్వర్లు, స్టూడెంట్ లైఫ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

మలేరియా కేసుల నమోదుతో అప్రమత్తత



హాస్టల్‌లో గిరిజన బాలికలతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -పిఎం పాలెం: మారికవలస సమీపంలోని ఎపి గిరిజన సంక్షేమ బాలికల బాలికల హాస్టల్ లో ఇద్దరు విద్యార్థినులకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది. శుక్రవారం హాస్టల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, సందర్శించారు. హాస్టల్‌లోని పరిస్థితులను,వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులోని నీటికి తరచూ క్లోరినేషన్ చేయించాలని, విద్యార్థినులంతా విధిగా దోమతెరలు వాడేలా చర్యలు చేపట్టాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.జ్వరాలు ప్రబలిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి తగు వ్యాధినిర్ధారణ పరీక్షలతోపాటు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

యుపిహెచ్‌సి సందర్శన

అనంతరం మారికవలస పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. యుపిహెచ్‌సిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బిసిజి.వాక్సినేషన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేసారు. రక్తహీనత లబ్ధిదారులను, గర్భిణులను గుర్తించి, వారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలని, పౌష్టికాహారం తీసుకునేలా చైతన్యపరచాలని ఎఎన్ఎం, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్లకు సూచించారు. ఆసుపత్రుల్లో సాదారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి-సెక్షన్ ప్రసవాలు నివారించాలని సూచించారు.

ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండి ఎటువంటి ఆరోపణలు రాకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. కీటక జనిత వ్యాధులు, స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ తులసిరాజ్, డిఎంఒ, ఎఎంఒ, మలేరియా సిబ్బంది, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రికల్చర్ గొడౌన్ నిర్మించాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజన రైతుల నిరసన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:-అరకులోయ మండల కేంద్రంలో విత్తనాలు నిల్వ ఉంచే అగ్రికల్చర్ గొడౌన్ నిర్మించి, రైతులకు సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులు, విత్తనాలు నిల్వ చేయడానికి 100 క్వింటాళ్ళ నిల్వ ఉంచే అగ్రికల్చర్ గొడౌన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై పంపిణి చేయాలన్నారు. మండలంలో 14 పంచాయితీలకు ఖరీఫ్ పంటలో సుమారు 80 నుండి 100 క్వింటాళ్ల ఎరువులు రైతులకు అవసరం ఉందని తెలిపారు. ఎరువులు బయట కొనుక్కోవడానికి ఆర్థిక స్థోమత లేక రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వాటిపైనే అధారపడుతున్నారన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు అందక తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు.

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్యూఆర్ కోడ్ పేమెంట్ విధానంతో పేమెంట్ చేయడానికి చాలా సమయం పడుతుందని, దీనిని రద్దు చేసి బ్యాంకులో డిపోజిట్ పద్ధతిని ప్రవేశ పెట్టి ఎరువులు పంపిణిలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యం లేకుండా అసలైన రైతులకు ఎరువులు పంపిణి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు త్వరితగతిన పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు, కె.బుజ్జి బాబు, జి.సత్యారావు, టి.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతుభరోసా కేంద్రం వద్ద నిరసన చేస్తున్న రైతులు, నాయకులు

సింహగిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

నేడు సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభం
ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, మేయర్
భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలకు ఆదేశం



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న విశాఖ కలెక్టర్, నగర మేయర్

ప్రజాశక్తి- సింహాచలం : ఆషాడ పౌర్ణమి ముందు రోజున శనివారం జరిగే సింహగిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ఉత్కళాంధ్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం, దేవస్థానం సిబ్బంది చేపట్టారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరింధర ప్రసాద్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి పరిశీలించారు. గిరి ప్రదక్షిణ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు భద్రత కల్పించారు.ఎక్కడికక్కడఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జోడుగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానం చేసే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు గిరిప్రదక్షిణ అనంతరం గిరి తిరగలేని భక్తుల కొరకు సింహగిరిపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు ఆదివారం ఉదయం తెల్లవారుజామున మూడు గంటలకు ఆలయ ప్రదక్షిణ చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు ఈ ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, మేయర్ జీవీఎంసీ బందం సింహాచలం కొండపై పర్యటించారు భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకున్న చర్యలపై కలెక్టర్, మేయర్,ఇతర అధికారులకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి వివరించారు సైన్ బోర్డులు ఏర్పాటు క్యూలైన్స్ శానిటరీ మంచినీటి సౌకర్యాలు తీసుకోవాలని సూచించారు.కాగా గిరిప్రదక్షిణలో భక్తులకు సేవలు అందించేందుకు, ప్రసాదవితరణకు ఇప్పటికే పలు స్వచ్ఛందసంస్థలు, ప్రజాసంఘాలు, ఆధ్యాత్మిక సంఘాలు అవసరమైన ఏర్పాట్లు చేశాయి.



హనుమంతువాక బిఆర్‌టిఎస్ రోడ్డులో ఏర్పాటుచేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

దారి పొడుగునా అవసరమైన సౌకర్యాలు

ఆరిలోవ : గురుపౌర్ణమి ముందు రోజు జరిగే గిరి ప్రదక్షిణలో నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, ఒడిస్సా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులకు దేవస్థానం, జివియంసి అధికారులు హనుమంతువాక నుంచి సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డులో తగు ఏర్పాట్లు చేశారు. బరహదారి పొడువునా మెడికల్ క్యాంపులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసారు. తాగునీరు, ప్రసాద వితరణ కౌంటర్లును ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా లుంబిని పార్కు లోపల నుంచి సముద్ర మార్గంలో ఉన్న గోడను తొలగించారు. వెళ్ళేవారికి, తిరిగి వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు నిర్మించారు. భక్తులు స్నానాలు ఆచరించి, దుస్తులు మార్చుకునే అవకాశం ఉన్నందున భక్తుల కోసం దుస్తులు మార్చుకునే గదులను సైతం నిర్మిస్తున్నారు. లుంబినీ పార్కు వద్ద సేదతీరే భక్తులు ఉండేందుకు టెంట్‌లు ఏర్పాటు చేయనున్నారు.

బాలికలకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను తక్షణమే అరికట్టాలని గిరిజన మహిళ సంఘం (ఐద్వా అనుబంధం) జిల్లా కార్యదర్శి యస్.హైమావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చిన్న పిల్లలపై అఘాయిత్యాలు పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదకొండమ్మ పండగ రోజున 6 ఏళ్ల పాప కామాంధుల చేతిలో బలైపోయిందన్నారు. నంద్యాల జిల్లాలో ఓ బాలిక పై ఇటువంటి సంఘటనే జరిగిందని తెలిపారు. గుంటూరు జిల్లా కొత్త రెడ్డి పాలెం లో 8 వ తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేసి హత్య చేశారని, విజయనగరం జిల్లా రామ చంద్రపురం లో పసి పిల్లలపై జరిగిన సంఘటన దారుణ మన్నారు. అనకాపల్లిలో కూడా 13 ఏళ్ల బాలిక పై అత్యాచారం జరిగిందని, ఇటువంటి ఎన్నో ఘటనలతో మహిళలకు పూర్తిగా భద్రత కరువైందన్నారు. మహిళలను, చిన్న పిల్లలను ముట్టుకోవాలంటే భయ పడేలా వెంటనే ప్రభుత్వం వారిని శిక్షించాలన్నారు. ప్రభుత్వాలు, చట్టాలు ఏమి చేయలేవని కామాంధులు ఈ ఘటనలకు పాల్పడుతున్నారని, తక్షణమే చర్యలు ప్రభుత్వం చేపట్టాలన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు సరికొత్త చికిత్స

-గీతంలో ఇల్లినాయస్ వర్సిటీ పరిశోధకుడు డాక్టర్ వీరవల్లి



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకుమార్

ప్రజాశక్తి -మధురవాడ: రక్తం గడ్డకట్టడంతో రక్తనాళం మూసుకుపోవడం లేదా రక్తనాళం పగిలిపోవడం ద్వారా మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం వల్ల ఏర్పడే బ్రెయిన్ స్ట్రోక్‌కు తమపరిశోధనల ద్వారా సరికొత్త చికిత్సా పద్ధతులను గుర్తించినట్లు ఇల్లినాయస్ విశ్వవిద్యాలయం కేన్సర్ బయాలజీ, ఫార్మకాలజీ విభాగం న్యూరో సైన్స్ పరిశోధకుడు డాక్టర్ వీరవల్లి కృష్ణకుమార్ వెల్లడించారు. శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, స్ట్రోక్‌లో ప్రధానంగా ఇస్కీమిక్, హెమరేజిక్. రెండు రకాలుంటాయని, రక్తం గడ్డకట్టి బ్రెయిన్‌కు సరఫరా ఆగిపోయినప్పుడు వచ్చే ఇస్కిమిక్ స్ట్రోక్‌ను ప్లాస్మినోజెన్ కణాల ప్రభావాన్ని అదుపు చేయడం ద్వారా నివారించవచ్చని తన అధ్యయనాల ద్వారా కనుగొన్నట్లు వెల్లడించారు కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజా, సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

స్టీల్ కార్మికుల వేతన బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు బకాయి పడ్డ మూడునెలల వేతనాన్ని యాజమాన్యం తక్షణం చెల్లించాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ యాజమాన్యం కావాలనే కార్మికులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు.

కార్మికుల వేతనాలపై యాజమాన్య వైఖరిని స్టీల్‌మంత్రి ఎదుట అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపడితే, ఆ వెంటనే సగం జీతం చెల్లించిందని, మిగిలిన సగం జీతం ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. తక్షణమే బకాయి వేతనాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, గంగాధర్, టివికె రాజు, పుల్లారావు పాల్గొన్నారు.

44 మంది విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 44మంది విద్యార్థినులు 2023-24 విద్యా సంవత్సరానికి మెరిట్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ శుక్ర వారం తెలిపారు. ఎంపికైన ఒక్కో విద్యార్థినికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.గతంలో 96 మంది విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్ పొందారన్నారు. సిఎంఇ, ఇసిఇ , సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు ప్రతిభ ఆధారంగా మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.



శ్రీరామగిరిలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

శ్రీరామగిరిని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-విఆర్.పురం : భారీ వర్షానికి మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో గురువారం ఇళ్లలోకి నీరు చేరిన నేపథ్యంలో శుక్రవారం ఆ గ్రామాన్ని సిపిఎం నాయకులు సందర్శించి పరిశీలించారు. ఇళ్ళల్లోకి నీరు వచ్చి ఇబ్బందులు పడ్డ బాధిత కుటుంబాల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ తక్షణం ప్రభుత్వం ముంపులో ఉన్న గ్రామాలు ప్రజలు ఇక్కడి నుండి పునరావాస కాలనీలకు వెళ్లే వరకు అన్ని గ్రామ పంచాతీల్లో ప్రత్యేక నిధులు మంజూరు చేసి రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, గుండెపూడి లక్ష్మణరావు, ఆత్మకూరు కాంతారావు, సోడి మల్లయ్య, మేర బోయిన రాజు, పులి ధర్మరాజు, నాళ్ళరపు చంద్రరావు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఎటపాక : వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో వరదలు వచ్చే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు సూచించారు. మండలంలోని గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు గ్రామాలలో గోదావరి వరదలపై శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలు సేకరించి దానిని ఒక తీర్మానంగా చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ముంపు బాధితులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం తరపున సహాయక చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సావిత్రి, నందిగామ సర్పంచ్ ఇంగిలపు బేబీ, మురుమూరు పంచాయతీ సర్పంచ్ పాయం నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అడ్డతీగలలో మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

జీడి మామిడి, పామాయిల్ మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎండి.రంగారావు ఆధ్వర్యంలో సర్పంచ్ పప్పుల చిట్టమ్మ చేతుల మీదగా శుక్రవారం రైతులకు జీడిమామిడి, పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. 176 మంది రైతులకు 250 ఎకరాలకు సుమారు 15 వేల మొక్కలను ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు జర్తా వెంకటరమణ రెడ్డి, ఎపిఒ మణి కుమారి, జెఇ బర్ల శ్రీనివాస్, యూనిట్ ఇన్చార్జ్ కామన కృష్ణమూర్తి, చిన్న, అట్ట శ్రీను, గ్రామ కమిటీ మెంబర్ కండేపల్లి రామకృష్ణ, బూత్ ఇంచార్జ్ బటాని వరలక్ష్మి, మారిశెట్టి వీరభద్రరావు, జనసేన నాయకులు టి.రాజేంద్ర అంజిరెడ్డి, సురేష్‌రెడ్డిపాల్గొన్నారు.

రంపచోడవరం : మండలం వేములకొండ పంచాయతీ లోయర్ పార్ట్ గ్రామలైన డబ్బవలస, సోకులగూడెం, దారగూడెం, ఆనాంపల్లి రైతులకు ఎన్ఆర్ఈజీఈఎస్ ద్వారా సబ్సిడీపై 28మందికి సర్పంచ్ కొమరం పండు దొర, ఎంపీటీసీ నర్రి పాపారావు ఆధ్వర్యాన జీడిమామిడి మొక్కలు పంపిణీ చేశారు. గిరిజన రైతులు ఈ మొక్కలను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

నిర్వాసితులను మళ్లీ గోదావరిలో ముంచుతారా ?

ముందస్తు చర్యలపై అధికారుల నిర్లక్ష్యం
పెద్ద ఆర్కూరు సర్పంచ్ నాగమణి

ప్రజాశక్తి- కూనవరం

వరద ముంపు సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యల్లో అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యం చూస్తుంటే నిర్వాసితులను మళ్లీ గోదావరిలో ముంచుతారా? అన్న అనుమానం కలుగుతుందని సిపిఎంకు చెందిన పెద్దఆర్కూర్ పంచాయతీ సర్పంచ్ నాగమణి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గోదావరి వరదలపై శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె, అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తహశీల్దారు తీరు చూస్తుంటే మరల 2022 వరదలలో మునిగినట్లు మండల ప్రజలు మునగడం తప్ప వేరే మార్గం కనిపించడం లేదని తెలిపారు. పక్క మండలం విఆర్ పురంలో తహశీల్దారు, అధికారులను ప్రజా ప్రతినిధులను ప్రజలను కలుపుకొని నిరంతరం ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి భరోసా ఇస్తుంటే, అందుకు భిన్నంగా కూనవరం తహశీల్దారు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మూడు నెలల నుండి వరదలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తూ, కావలసిన మౌలిక సదుపాయాలను సమకూర్చమని ఎన్నో దరఖాస్తులు సీపీఎం ప్రతినిధులు, నాయకులు ఇచ్చినా పెడచెవిన పెట్టిన తీరు బాధాకరమన్నారు. శుక్రవారం నాటి సమావేశంలో నిర్వాసితులకు రిలీఫ్ కేంద్రాలుగా కొండ గుట్టలను, అడవి ప్రాంతాలను చూపించారని, అక్కడ కనీసం తాగునీరు, వసతి లేవని తెలిపారు. వరద వస్తే మునిగే ప్రాంతాలను పునరావాస కేంద్రాలుగా నిర్ణయించడం అధికారుల సమన్వయ లోపంగా కనిపిస్తుందన్నారు. అధికారుల తీరుపై ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం సర్పంచ్‌లు బొగ్గా వెంకమ్మ, రామారావు, ఎంపిటిసి కారం జయసుధ, సీపీఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, శ్యామల కృష్ణ, కొండా ఈశ్వర్లు, తలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి

గెస్ట్ ఫ్యాకల్టీని కాంట్రాక్ట్ టీచర్లుగా తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఎటపాక : 2016 నుండి గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ టీచర్లగా తీసుకొని కొనసాగించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ద్వారా సమగ్ర శిక్ష స్టేట్ సెక్రటరీ మధుసూధన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కసుర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో గెస్ట్ టీచర్లగా పని చేయడానికి 2016లో తమకు రెండు దఫాలు రంపచోడవరం, కాకినాడల్లో కౌన్సిలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి, డెమో క్లాస్ డిఇఒ సమక్షంలో తీసుకొని తమ ప్రతిభను గుర్తించిన అధికారులు తమను గెస్ట్ టీచర్లగా నియామకాలు చేశారని తెలిపారు. భవిషత్‌లో కూడా తమను కొనసాగిస్తామని హామీ ఇచ్చి, పై అధికారుల సమక్షంలో అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అప్పటి నుండి తాము రెగ్యులర్ సిఆర్‌టిలతో సమానంగా నైట్ డ్యూటీలు, సండే డ్యూటీలు, పండగ డ్యూటీలు, స్టడీ అవర్స్ డ్యూటీలు చేస్తున్నామని, తమ సబ్జెక్టలో 100శాతం ఫలితాలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఇప్పుడు తమకు అవకాశం ఇవ్వకుండా అనుభవం లేనివారిని తీసుకొని, అనుభవం ఉన్న తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న తమను సిఆర్టిలుగా నియమించాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు మొత్తం డేటా తెప్పుంచుకొని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎటపాక సిపిఎం మండల కార్యదర్శి ఐవి, కూనవరం, విఆర్.పురం, వై.రామవరం, గంగవరం కేజీబీవీ గెస్ట్ టీచర్లు కుమారి, వనజ, చంద్రమ్మ, పద్మశ్రీ, శాంతి లత, రామలక్ష్మి, పద్మ, సీతమ్మ తదితరులున్నారు.

రహదారిపై మురుగునీరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాజవొమ్మంగి అల్లూరి కూడలి వద్ద మురుగునీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రాజవొమ్మంగిలో జాతీయ రహదారిపై డ్రెన్లు అసంపూర్తిగా నిర్మించడంతో మురుగునీరు, చెత్తాచెదారం రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీంతో వాహనాలపై వెళ్లేవారు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వెదజల్లడం వలన దోమలు ఈగల సంఖ్య పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



భూపతిపాలెం రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

రిజర్వాయర్లకు జలకళ

ప్రజాశక్తి - సీలేరు : వారం రోజుల నుంచి విస్తీరంగా కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సీలేరు నది పరివాహక ప్రాంతాల నుంచి వరద నీరు సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాల్లో చేరుతుండడంతో రిజర్వాయర్లు కలకలలాడుతున్నాయి. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో క్రమేపి నీటిమట్టలు పెరుగుతున్నాయి. జోలాపుట్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 2750 అడుగులు అంటే 34.27 టిఎంసిలు కాగా, ఈ నెల 12 నాటికి 2701 అడుగుల నీటిమట్ట ఉంది. వర్షాలకు శుక్రవారం నాటికి జోలాపుట్‌లో 2708.50 అడుగులు నీటిమట్టం పెరిగింది. ఇక్కడ ప్రస్తుతం 5.8465 టీఎంసీలు నీరు నీల్వ ఉంది. గుంటవాడ జలాశయం నీటిమట్టం 1360 అడుగులు కాగా ఈనెల 12 నాటికి 1341 అడుగులు నీటిమట్టం ఉంది. ప్రస్తుతం ఈ జలాశయంలో 1456 అడుగులకు చేరింది. డొంకరాయి జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా జూలై 12 నాటికి 1002.40 ఉంది. ప్రస్తుతం 1006.90 అడుగులు పెరిగిందని ఏపీ జెన్కో ఈఈ ప్రభాకర్ తెలిపారు.

భూపతిపాలెం రిజర్వాయర్ నుండి నీరు విడుదల

రంపచోడవరం : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రంపచోడవరం మండలంలోని భూపతిపాలెం రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేశారు. వరద నీరు భారీగా వచ్చి చేరడంతో భూపతిపాలెం రిజర్వాయర్ ఒక గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని, పంట బోధి ద్వారా 100 క్యూసెక్కులు, మొత్తం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అధిక వర్షాలతో కొండవాగుల నుండి నీరు ముసిరిమిల్లి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుంది. అయితే రిజర్వాయర్ హెడ్ వర్క్ పూర్తి కాకపోవడంతో రిజర్వాయర్ నుండి భారీగా నీరు ప్రవహిస్తూ గోదావరిలోకి వెళుతుంది.

వరదల ముందస్తు చర్యలపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి- కూనవరం : రాబోవు గోదావరి - శబరి వరదలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య శుక్రవారం తహశీల్దారు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో మండలం స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వరదల సమయంలో చేపట్టవలసిన సహాయక చర్యలను, పునరావాస కేంద్రాల నిర్వహణ మొదలగు అంశాలపై సమీక్ష చేశారు. అనంతరం పిఒ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి పూర్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1254వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ సెయిల్‌లో విలీనం చేసే విషయంలో ప్రభుత్వాల తాత్సారం తగదన్నారు. ఉద్యోగులకు, కార్మికులు వేతనాలను సకాలంలో ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే మూడున్నర సంవత్సరాలుగా రా మెటీరియల్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

వేల కోట్లతో ఏర్పాటు చేసిన ఉత్పత్తి విభాగాలను ముందస్తు ప్రణాళిక లేకుండా మూసివేయడంతో భారీ యంత్రాలు పనికి రాకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షల్లో నాయకులు పి.రామకృష్ణరాజు, ఎంఎన్.రావు, పిజికె.రాజు, కెఎస్.సచారావ్, డి.మధు, జి.మోహన్, బివి.రమణ పాల్గొన్నారు.